సాక్షి ఖమ్మం

మంగళవారం । 5 । ఆగస్టు । 2025



ఇలా అయితే ఎలా?

మెప్మాలో సీఓల కొరత వేధిస్తుండడంతో మహిళా సంఘాల పర్యవేక్షణ లోపించడమే కాక కొత్త సంఘాల ఏర్పాటులో ఆలస్యమవుతోంది. 8లో



భారీ వర్షం

తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. 8లో

గరిష్టం / కనిష్టం
34° / 25°

వాతావరణం

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రత పెరిగే అవకాశముంది. సాయంత్రం తర్వాతే వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

దేవతామూర్తులకు పవిత్రాల ధారణ



హోమం చేస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల సందర్భంగా సోమవారం దేవతా మూర్తులకు పవిత్రాల ధారణ నిర్వహించారు. పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు యాగశాలలో ప్రాతఃకాలార్చన, మండపారాధన, ఆవాహిత దేవత హోమం, బలిహరణ పూజలు చేశారు. అనంతరం శ్రీవారి ఆలయంతో పాటు ఉప ఆలయాల్లో దేవతామూర్తులకు పవిత్రాల ధారణ, పూజలు నిర్వహించారు. ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా మొర్సుమల్లికి చెందిన కళ్యాణం విష్ణువర్ధన్, శ్రీధర్ అందజేసి నవగ్రహాల విగ్రహాలను పునఃప్రతిష్ట చేశారు. ఆలయ ఈఓ కొత్తూరు జగన్‌మోహన్ రావు, ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మం రూరల్/ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9గంటలకు తిరుమలాయపాలెంలో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశాక, లబ్ధిదారులకు రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తారు. అలాగే, 11గంటలకు ఏదులాపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన సైకిళ్లు పంపిణీ చేయనున్నారు. అనంతరం ఖమ్మం రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెం, తనగంపాడు, కస్నాతండాలో రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేస్తారు.

సర్వే, శిక్షణకు ఐసీఎంఆర్ బృందం

ఖమ్మం వైద్యవిభాగం: ఐసీఎంఆర్(ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) సెంట్రల్ టీం సర్వేయర్లు (విద్యార్థులు) జిల్లాలో 60 రోజుల క్షేత్రస్థాయి శిక్షణ కోసం వచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ కార్యాలయంలో సోమవారం వారు రిపోర్టు చేయగా అసంక్రమిత వ్యాధుల నివారణ ప్రోగ్రాం అధికారి రామారావు, కీటక జనిత వ్యాధుల నివారణ అధికారి వెంకటరమణ పలు అంశాలను వివరించారు. అరవై రోజుల పాటు క్షేత్రస్థాయిలో వ్యాధుల విస్తృతిపై సర్వే చేయడమే కాక ప్రజలకు అవగాహన కల్పించనుండగా ప్రాజెక్ట్ శాస్త్రవేత్తలు స్వాతి, డాక్టర్ రోహిత్ పర్యవేక్షిస్తారు. కాగా, బీపీ, మధుమేహంతో బాధపడుతున్న వారి చికిత్సకు ముందు, తర్వాత పరిస్థితులపై ఈ బృందం అధ్యయనం చేయనుంది. ప్రాజెక్ట్ క్వాలిటీ సూపర్‌వైజర్ మాలతి తదితరులు పాల్గొన్నారు.

ఇక సిక్స్‌లు.. ఫోర్లు !

రఘునాథపాలెంలో క్రికెట్ స్టేడియానికి 20ఎకరాలు



ప్రతిపాదిత స్థలంలో పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంఅర్బన్: పెరుగుతున్న నగర విస్తరణ, యువతలో క్రీడలపై ఆసక్తి దృష్ట్యా ఖమ్మం సమీపాన రఘునాథపాలెంలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి 20 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. సర్వే నంబర్ 218లోని ఈ భూమిని రెవెన్యూ అధికారులు క్రీడాశాఖకు అప్పగించారు. తొలుత 15.20ఎకరాలు అప్పగించగా, కనీసం 20ఎకరాల అవసరమనే వినతితో మిగతా స్థలాన్ని కూడా రెవెన్యూ అధికారులు కేటాయించారు. ప్రస్తుతం ఖమ్మంలో అన్ని క్రీడల శిక్షణకు 14ఎకరాల విస్తీర్ణంతో సర్దార్ పటేల్ స్టేడియం ఉన్నప్పటికీ క్రికెట్ క్రీడాకారుల అవసరాలకు ప్రత్యేక స్టేడియం లేదు. దీంతో రఘునాథపాలెం బైపాస్ రోడ్డుకు ఆనుకుని నరసింహులు గుట్టపై విశాలమైన స్థలాన్ని కేటాయించారు. సుమారు రూ.20 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక వసతులతో ఇక్కడ స్టేడియం నిర్మించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు.

మున్నేటికి వరద



కాల్వొడ్డు వద్ద మున్నేటిలో వరద

వారం రోజులుగా జిల్లా కేంద్రంలోని మున్నేటికి ఎగువ నుంచి వరద తాకిడి లేకపోవడంతో ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. అయితే, సోమవారం సాయంత్రం ఒక్కసారిగా వరద పెరిగింది. మున్నేటికి ఎగువ ప్రాంతాల్లో వర్షం కురవడం, పాకాల నుండి వరద వస్తుండదంతో మధ్యాహ్నం 2గంటల నుంచి ఖమ్మం కాల్వొడ్డు వద్ద 10అడుగులకు పైగా వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు మున్నేరు వైపు ఎవరూ వెళ్లకుండా పోలీసులతో గస్తీ ఏర్పాటు చేయించారు. అంతేకాక ఎగువ ప్రాంతాల్లో వర్షాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. – ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం అర్బన్

21 అడుగులకు పాలేరు



కళకళలాడుతున్న పాలేరు రిజర్వాయర్

మండలంలోని పాలేరు రిజర్వాయర్ సోమవారం సాయంత్రం 21అడుగులకు చేరింది. రిజర్వాయర్ నీటిమట్టం 23 అడుగులు కాగా మరో రెండు అడుగులు చేరితే పూర్తిస్థాయిలో నిండుతుంది. సాగర్ నుండి ఇన్‌ఫ్లో 3,642 క్యూసెక్కులకు తోడు మరో 600 క్యూసెక్కుల వరద చేరుతోంది. దీంతో ఎడమ కాల్వ, పాలేరు పాత కాల్వ, భక్త రామదాసు ప్రాజెక్టుకు నీటి విడుదల కొనసాగిస్తున్నారు. కాగా, ఖమ్మం నిజాంపేటకు చెందిన ఓ వ్యక్తి సాగర్ కాల్వలో గల్లంతవగా గాలింపు చర్యల కోసం ఇన్‌ఫ్లో తగ్గించిన అధికారులు మృతదేహం లభించాక సరఫరా యథావిధిగా కొనసాగిస్తున్నారు. – కూసుమంచి

ఏడు తడులు.. వారబందీ విధానం

సాగర్ జలాల విడుదల షెడ్యూల్ ఖరారు

ఖమ్మంఅర్బన్: వానాకాలం పంటల సాగు అవసరాల కోసం సాగర్ ఎడమ కాల్వ ద్వారా ఆయకట్టుకు నీటి విడుదల షెడ్యూల్ ఖరారైంది. జిల్లాలోని 17 మండలాల పరిధిలో 2.54 లక్షల ఎకరాల ఆయకట్టుతో పాటు మరో 10వేల ఎకరాలకు కలిపి 2.64 వేల ఎకరాలకు 33.58 టీఎంసీల నీరు సరఫరా చేయనున్నారు. ఈమేరకు షెడ్యూల్ వివరాలను జల వనరుల శాఖ సీఈ రమేష్ సోమవారం వెల్ల డించారు. ఇప్పటికే కొంత మేర నీటి విడుదల కొనసాగుతుండగా షెడ్యూల్ ఆధారంగా నవంబర్ 22వ తేదీ వరకు విడతల వారీగా వారబందీ విధానంలో ఏడు తడులుగా సాగర్ జలాలు విడుదల చేస్తామని తెలిపారు.

రెండు భాగాలుగా ఆయకట్టు

సాగర్ నుండి వారబందీ విధానంలో తొమ్మిది రోజులు నీరు విడుదల చేస్తూ.. ఆరు రోజుల పాటు నిలిపివేయనున్నారు. ఈ షెడ్యూల్‌కు అనుగుణంగా జిల్లా ఆయకట్టును రెండు భాగాలుగా చేసి ఆన్ – ఆఫ్ విధానంలో నీటి విడుదలకు నిర్ణయించారు. బోనకల్ బ్రాంచ్ కాల్వ పరిధిలో తనికెళ్ల రెగ్యులేటరీ వరకు ఒక భాగంగా, దానికి దిగువ ఆయకట్టును రెండో భాగంగా విభజించి చివరి భూములకు సైతం నీరు అందించేలా విడుదల చేస్తామని అధికారులు వెల్లడించారు. అయితే, తొలి షెడ్యూల్ మాత్రం ఈనెల 24వరకు నిరంతరాయంగా కొనసాగించి, ఆతర్వాత నుండి తొమ్మిది రోజులు ఆన్, ఆరు రోజుల పాటు ఆఫ్ విధానంలో నీటి విడుదల ఉంటుందని తెలిపారు.

పెద్దాస్పత్రి కిటకిట..



జనరల్ ఆస్పత్రి జ్వరాల వార్డులో చికిత్స పొందుతున్న బాధితులు

సీజనల్ వ్యాధులతో వస్తున్న బాధితులు

- డెంగీ, విషజ్వరాలతో చేరుతున్న జిల్లా వాసులు
- రోజుకు 1000కి పైగా ఓపీ కేసులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి ఇటీవల పేషెంట్ల తాకిడి పెరిగింది. ముఖ్యంగా డెంగీ, విష జ్వరాలతో ఎక్కువ మంది వస్తున్నారు. అంతేకాక ఇతర వ్యాధుల ప్రభావం కూడా ఎక్కువగానే ఉండడంతో వార్డులన్నీ బాధితులతో నిండిపోయాయి. ఇక్కడ గత పది రోజులుగా సగటున నిత్యం 1100 నుంచి 1200 మంది వరకు వైద్య సేవల కోసం వస్తున్నారు. గత పది రోజుల్లో 11,165 మంది ఓపీ వైద్య సేవలు పొందగా, 922 మంది ఇన్ పేషెంట్లుగా చేరి చికిత్స పొందుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు జ్వరాల ప్రభావంతో ఆస్పత్రికి ఎక్కువగా వస్తున్నారు. పెద్దాస్పత్రిలో ప్రస్తుతం ఇద్దరు డెంగీ పాజిటివ్ రోగులు చికిత్స పొందుతుండగా, వైరల్ జ్వరాల బారిన పడి వందలాది మంది చికిత్స తీసుకుంటున్నారు.

లెక్క తేలని 'ప్రైవేట్'..

ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో గత 10 రోజులుగా జ్వరాలతో చేరే వారి సంఖ్య పెరిగిపోతోంది. అయితే ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదయ్యే జ్వర కేసుల వివరాలు తెలియడం లేదు. కేసుల వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేయాలని, సమాచారం ఇవ్వాలని వైద్యారోగ్య శాఖ ఆదేశాలు జారీ చేసినా ప్రైవేటు యాజమాన్యాలు పెడచెవిన పెడుతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల నుంచి ఏరోజుకారోజు వివరాలు అందజేస్తే వైద్యారోగ్య శాఖ అప్రమత్తమయ్యే అవకాశం ఉంటుంది. ఎక్కువ జ్వర కేసులు ఎక్కడి నుంచి వస్తున్నాయో గుర్తించి, అక్కడ ముందస్తు చర్యలు తీసుకోవచ్చు. కానీ ప్రైవేటు ఆస్పత్రుల వారు లెక్కలు చెప్పకపోవడంతో జాగ్రత్త చర్యలు లేక వ్యాధులు తీవ్రమవుతున్నాయని తెలుస్తోంది. కాగా ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్య అధికారులు సూచిస్తున్నారు. డెంగీ కారక దోమ ఇంటి పరిసరాల్లోనే జీవిస్తుందని, ఇంటి పరిసరాల్లో పాత వస్తువులు నిల్వ ఉంచకుండా తొలగించాలని అంటున్నారు. లేదంటే వాటిలో గుడ్డు పొదిగి లార్వా వృద్ధి చెంది డెంగీ కారక దోమలు పుట్టుకొస్తాయని చెబుతున్నారు.

జిల్లాలో 30 డెంగీ కేసులు..



జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో పారిశుద్ధ్య సమస్యలు ఏర్పడి సీజనల్ వ్యాధుల వ్యాప్తి పెరిగింది. ముఖ్యంగా డెంగీ కేసులు ఎక్కువగా వెలుగు చూస్తున్నాయి. ఇటీవల తల్లాడ, తిరుమలాయపాలెం మండలాల్లో ఎక్కువగా కేసులు వెలుగులోకి వచ్చాయి. సీజనల్ వ్యాధుల కట్టడికి వైద్యారోగ్య శాఖ చర్యలు తీసుకుంటున్నా.. వ్యాధుల వ్యాప్తి మాత్రం పెరుగుతూనే ఉంది. ఆ శాఖ అధికారులు చేపట్టిన ఇంటింటి జ్వర సర్వేలో ఎక్కువ కేసులు వెలుగు చూస్తున్నట్లు తెలుస్తోంది. డెంగీతో పాటు విషజ్వరాల ప్రభావం అధికంగా ఉన్నట్లు సమాచారం.

గత పది రోజులుగా పెద్దాస్పత్రిలో ఓపీ, ఐపీ సేవలు

తేదీ	ఔట్ పేషెంట్	ఇన్ పేషెంట్
24 (జూలై)	1,128	59
25	1,083	105
26	1,330	85
27 (ఆదివారం)	00	35
28	1,606	119
29	1,452	109
30	1,385	110
31	839	82
01 (ఆగస్టు)	1,230	119
02	1,112	59

ఎప్పటికప్పుడు దరఖాస్తుల పరిష్కారం





ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి (ఇన్‌సెట్) కార్మికుడి కుటుంబానికి బీమా చెక్కు అందజేస్తున్న కలెక్టర్, అధికారులు

- ఈ–ఆఫీస్ ద్వారానే ఫైళ్ల బదలాయింపు
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం సహకారనగర్: ప్రజావాణిలో అందే దరఖాస్తులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ ఏ ఫిర్యాదును కూడా పెండింగ్‌లో పెట్టొద్దని తెలిపారు. అలాగే, అన్ని శాఖల ఆధ్వర్యాన ఫైళ్ల బదలాయింపు ఈ–ఆఫీస్ విధానంలోనే చేపట్టాలని స్పష్టం చేశారు.

- ప్రమాదవశాత్తు మరణించిన మల్టీ పర్పస్ వర్కర్ వీరస్వామి కుటుంబానికి మంజూరైన రూ.10 లక్షల బీమా పరిహారం చెక్కును కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని మల్టీ పర్పస్ వర్కర్లు 2,087 మందికి పోస్టల్ శాఖ ద్వారా ప్రమాద బీమా చేయించామని తెలిపారు.
- స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు ఇచ్చేందుకు నిర్దిష్ట సంఖ్యలో మాత్రమే దరఖాస్తులు ఇవ్వాలని తెలిపారు. ఈసమావేశాల్లో జెడ్పీ సీఈఓ దీక్ష రైనా, డీపీఓ ఆశాలత, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీఆర్‌డీఓ సన్యాసయ్య, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
- అలాగే, జూలై 31న ఉద్యోగ విరమణ చేసిన 13మంది అధికారులు, సిబ్బందిని కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అనుదీప్ సన్మానించారు. వివిధ శాఖల్లో రిటైర్డ్ అయిన డాక్టర్ కె.శ్రీనివాసరావు, ఏ.వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, పీ.వీ.నాగేందర్‌రావు, ఎస్.విజయకుమార్, డాక్టర్ కె.సుధారాణి, విజయ్, ఎస్.ఎల్లస్వామి, జహీరుద్దీన్, వెంకటేశ్వర్లు, బి.నరసయ్య, రాంచందర్, పద్మను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కాగా, డీపీఆర్వో కార్యాలయ డ్రైవర్ నరసయ్యను డీపీఆర్వో గౌస్, ఉద్యోగులు సైతం సన్మానించారు.

11న నులి పురుగుల నివారణ దినోత్సవం

ఖమ్మంవైద్యవిభాగం: నులి పురుగుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1 – 19 ఏళ్ల పిల్లలకు ఈనెల 11న నులిపురుగుల నివారణ కోసం అల్బెండజోల్ మాత్రలు వేయాలని, ఎవరైనా మిగిలితే ఆగస్టు 18న అందించాలని సూచించారు. ఇందుకోసం ఏర్పాట్లు మొదలుపెట్టాలని తెలిపారు. డీఎంహెచ్ఓ కళావతిబాయి మాట్లాడగా కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీఆర్వో ఏ.పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్‌డీఓ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

హాజరైన 213 మంది ఉపాధ్యాయులు



ఉపాధ్యాయుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా పదోన్నతి ఇచ్చే ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే సీనియారిటీ ఆధారంగా జాబితా విడుదల చేయగా ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల పరిశీలన సోమవారం డీఈఓ కార్యాలయంలో మొదలుపెట్టారు. ఇద్దరు గెజిటెడ్ హెచ్‌ఎంలు, డీఈఓ కార్యాలయ ఉద్యోగితో ఏర్పాటైన ఏడు బృందాలు సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. ఈమేరకు 260మందిని అర్హులుగా గుర్తించగా, తొలిరోజు 213 మంది ఉపాధ్యాయులు హాజరుకావడంతో సర్టిఫికెట్ల పరిశీలన రాత్రి వరకు కొనసాగింది.

న్యాయం చేయాలని ఎల్పీల వినతి

పదోన్నతుల ప్రక్రియలో తమకు అన్యాయం జరిగిందని తెలుగు, హిందీ లాంగ్వేజ్ పండిట్లు పలువురు వాపోయారు. కొందరిని గత ఏడాది ఎస్ఏలుగా అప్‌గ్రేడ్ చేయగా.. ప్రస్తుతం ఎస్ఏ తెలుగు ఖాళీలు 26కి 18, హిందీ ఖాళీలు 16కు గాను 11గానే చూపించారని తెలిపారు. ఈమేరకు వాస్తవ సంఖ్య ఆధారంగా అర్హులకు పదోన్నతులు కల్పించాలని డీఈఓ కార్యాలయంతో పాటు తమకు అండగా నిలవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్‌రావుకు వినతిపత్రాలు అందజేశారు.

ఇన్‌చార్జ్ డీఈఓగా నాగపద్మజ



ఖమ్మం సహకారనగర్: జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగపద్మజ ఇన్‌చార్జ్ జిల్లా విద్యాశాఖాధికారిగా నియమితులయ్యారు. ఈమేరకు కలెక్టర్ అనుదీప్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్నాళ్లు డీఈఓగా కొనసాగిన సత్యనారాయణ ఉద్యోగ విరమణ చేయడంతో ఆ స్థానం ఖాళీ అయింది. ప్రస్తుతం ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతుండడంతో నాగపద్మజను ఇన్‌చార్జ్ డీఈఓగా నియమించారు.

జీపీల పెండింగ్ బిల్లులపై ఆరా

నేలకొండపల్లి: గ్రామపంచాయతీల్లో గత పాలకవర్గాలు చేపట్టిన పనుల పెండింగ్ బిల్లుల వివరాలు సమర్పించాలని ఉన్నతాధికారులు సూచించారు. ఐదేళ్లలో చేసిన పనులు, ఎం.బీ. రికార్డులు, రికార్డులు లేకుండా పనులు, వాటి బిల్లులు సమర్పించడమే కాక పాలకవర్గాలు తీర్మానాలు ఉంటే ఆ జిరాక్స్‌లు జత చేసి పంపాలని జిల్లా పంచాయతీ అధికారులు కార్యదర్శులను ఆదేశించారు. దీంతో సోమవారం జిల్లాలోని అన్ని జీపీల కార్యదర్శులు పెండింగ్ బిల్లులు సిద్ధం చేయడం మొదలుపెట్టారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రభుత్వం పెండింగ్ బిల్లులు మంజూరు చేసేందుకే వివరాలు ఆరా తీస్తోందన్న ప్రచారంతో మాజీ సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, జిల్లాలోని ప్రతీ జీపీకి కనీసం రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు బిల్లులు పెండింగ్ ఉన్నట్లు సమాచారం.

నేరం జరిగిన వెంటనే చేరేలా...

- అందుబాటులోకి ఫోరెన్సిక్ ల్యాబ్ వ్యాన్
- ప్రారంభించిన సీపీ సునీల్‌దత్



ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ మొబైల్ యూనిట్‌తో సీపీ సునీల్‌దత్, అధికారులు

ఖమ్మంక్రైం: నేరం జరిగే ప్రదేశంలో సాక్ష్యాలు సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించాక నివేదిక కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఆ అవసరం ఉండదు. ఎక్కడికక్కడ సాక్ష్యాల సేకరణ, విశ్లేషణ కోసం అత్యాధునిక పరికరాలతో కూడిన ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ మొబైల్ యూనిట్ అందుబాటులోకి వచ్చింది. ఈ ల్యాబ్‌ను పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. నేరం జరిగిన ప్రదేశానికి వెళ్లి నిందితుల వేలిముద్రలు, రక్తపు నమూనాలు, ఇతర ఆధారాలను సేకరించడమే కాక విశ్లేషించేందుకు ఈ మొబైల్ ల్యాబ్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఏఆర్ ఏసీపీ సుశీల్‌సింగ్, వైద్యులు నాగలక్ష్మి, సుధాకర్, అసిస్టెంట్ డైరెక్టర్ నరసింహ, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

వేగంగా కేసుల విచారణ

మాదకద్రవ్యాలు, పోక్సో కేసుల్లో విచారణ వేగంగా చేపట్టడమే కాక రోడ్డు ప్రమాదాలను అరికట్టే దిశగా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. జిల్లావ్యాప్తంగా పోలీసు అధికారులతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేసుల నమోదు విచారణ, చార్జీషీట్ల దాఖలుపై సమీక్షించారు. వైరా, కల్లూరు డివిజన్ల పరిధిలో గుర్తించిన బ్లాక్ స్పాట్లలో బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. నేరాల నియంత్రణ, చోరీ సొత్తు రికవరీ కోసం స్టేషన్ల వారీగా ప్రత్యేక బృందాలను నియమించాలని సూచించారు. అలాగే, జూదం, బెట్టింగ్, గంజాయి నియంత్రణ, సీసీ కెమెరాల ఏర్పాటుపై సూచనలు చేశారు. ఈ సమావేశంలో సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ స్వామి, ఎస్సైలు రవి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్‌గా ఖమ్మం



ఓవరాల్ చాంపియన్‌షిప్ అందుకుంటున్న జిల్లా క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్: అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ల ఆధ్వర్యాన హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 11వ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ టోర్నీ సోమవారం ముగిసింది. అండర్–14, 16, 18, 20 బాలబాలికల విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 33జిల్లాల నుంచి 1,400 మంది అథ్లెట్లు పాల్గొన్నారు. టోర్నీలో ఖమ్మం జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. అలాగే, అండర్–18 బాలికల విభాగంలో ఖమ్మం క్రీడాకారులు ట్రోఫీ గెలుచుకున్నారు.

క్లుప్తంగా

టీఏల అసోసియేషన్ రాష్ట్ర కమిటీలో స్థానం



రాష్ట్ర కమిటీకి ఎన్నికైన టెక్నికల్ అసిస్టెంట్లు

మధిర: ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ల రాష్ట్ర కమిటీని యాదగిరిగుట్టలో ఆదివారం ఎన్నుకున్నారు. ఈ మేరకు కమిటీలో జిల్లా నుంచి పలువురు టెక్నికల్ అసిస్టెంట్లకు స్థానం దక్కింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మేరుగు శ్రీనివాసరావు(పెనుబల్లి), ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆవుల సంతోష్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా మద్దాల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యురాలిగా ఏ.సౌజన్య ఎన్నికయ్యారు. వీరిని జిల్లా అధ్యక్షుడు పగిడిపల్లి మనోహర్‌రావు, గౌరవ అధ్యక్షుడు షేక్ నజీర్, కోశాధికారి ఆదుర్తి రమేష్‌కుమార్ తదితరులు అభినందించారు.

నేటి నుంచి రాజీవ్ ట్రోఫీ

ఖమ్మం స్పోర్ట్స్: రాజీవ్ స్మారక అండర్–12, 14, 16 క్రికెట్‌పోటీలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. అండర్–12 ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో, అండర్–14 కొత్తగూడెంలో, అండర్–16 బాలుర క్రికెట్ పోటీలు కల్లూరు మినీ స్టేడియంలో నిర్వహిస్తామని టోర్నీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.డీ.మతిన్ తెలిపారు. ఇప్పటికే పలు జట్ల బాధ్యులు పేర్లు నమోదు చేసుకోగా, ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యాన టోర్నీ నిర్వహణకు ఏర్పాట్లు చేశామని వెల్లడించారు.

10న ఉమ్మడి జిల్లా టీ.టీ. జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 10 తేదీన ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉమ్మ డి జిల్లా అధ్యక్షుడు బాలసాని విజయ్ తెలి పారు. 11 – 19 ఏళ్ల వయసు కలిగిన బాలబాలికలతో పాటు ఓపెన్ విభాగంలో పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. ఖమ్మంలో జరిగే రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీల్లో పాల్గొనేందుకు జట్లను ఎంపిక చేయనుండగా ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈనెల 10న ఉదయం 9గంటలకు జనన ధ్రువీకరణ పత్రంతో పాటు ఒక పాస్‌పోర్టు సైజు ఫొటోతో పటేల్ స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాలకు కార్యదర్శి 98484 08335 నంబర్‌లో సంప్రదించాలని విజయ్ తెలిపారు.

ఇన్‌స్ట్రక్టర్ కుటుంబానికి రూ.1.88లక్షల ఆర్థికసాయం



శ్రీదేవి కుమార్తెకు చెక్కు అందజేస్తున్న ఇన్‌స్ట్రక్టర్లు

తల్లాడ: మండలంలోని రామచంద్రాపురానికి చెందిన యోగా ఇన్‌స్ట్రక్టర్ కందుల శ్రీదేవి ఇటీవల డెంగీతో మృతి చెందింది. ఈమేరకు తెలంగాణ యోగా టీచర్ల కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యాన సేకరించిన రూ.1.88లక్షలను ఆమె కుమార్తె చదువుకు సోమవారం అందజేశారు. ఇన్‌స్ట్రక్టర్లు, యోగా కోఆర్డినేషన్ కమిటీ మహిళా సభ్యులు, యోగా సంస్థల నుంచి ఈ నగదు సేకరించినట్లు తెలిపారు. డాక్టర్ సత్యరెడ్డి, రవికుమార్, బాహర్ అలీ, వెంకటేశ్వర్లు, పద్మావతి, ఝాన్సీ, లక్ష్మి, సత్యనారాయణ, శ్రీకాంత్, కొండల్‌రావు, అజ్మీరా నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

17మంది వైద్యుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్ పద్ధతిపై 17 మంది వైద్యులను నియమించనున్నట్లు జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ కె.రాజశేఖర్ గౌడ్ తెలిపారు. ఆరుగురు గైనకాలజిస్టులు, ముగ్గురు అనస్థీషియన్లు, ఇద్దరు చొప్పున ఆఫ్తాల్మిక్, పీడియాట్రిక్ వైద్యులతో పాటు ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, డ్యూటీ మెడికల్ ఆఫీసర్ విభాగాల్లో ఒక్కో పోస్టు ఉందని వెల్లడించారు. అర్హులైన వైద్యులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల అటెస్టెడ్ జిరాక్స్‌లతో పాటు రెండు ఫొటోలతో ఈనెల 6న ఉదయం కలెక్టరేట్‌లోని డీసీహెచ్ఎస్ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.



కన్నీళ్ల నడుమ కలెక్టర్ అనుదీప్‌కు సమస్య వివరిస్తున్న వృద్ధులు



అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి గోడు వెళ్లబోసుకుంటూ...



డీఆర్‌ఓ, జెడ్పీ సీఈఓలకు వినతిపత్రం ఇచ్చిన వృద్ధురాలు

పండుటాకుల గోస

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జనం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఇందులో వృద్ధులు కూడా చాలా మంది ఉన్నారు. ఈ సందర్భంగా వారు తడబడుతున్న మాటలతో తమ బాధలను అధికారులకు ఏకరువు పెట్టారు. కొందరు కుటుంబ, వ్యక్తిగత సమస్యలను కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఆర్‌ఓ, జెడ్పీ సీఈఓలకు వివరిస్తూ కన్నీటి పర్యంతం కావడం కనిపించింది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఇలా అయితే ఎలా?

- మెప్మాలో వేధిస్తున్న సీఓల కొరత
- పది మంది పని నలుగురితోనే నెట్టుకొస్తున్న వైనం
- ఇద్దరికి ఏదులాపురం, కల్లూరు బాధ్యతలు అదనం

సంఘాలు,	సభ్యులు...
కేఎంసీలో మహిళా సంఘాలు	4,412
సంఘాల్లో సభ్యులైన మహిళలు	42,997
ఏర్పాటుచేయాల్సిన కొత్త సంఘాలు	1,148
ఇప్పటి వరకు ఏర్పాటైనవి	413

ఖమ్మంమయూరిసెంటర్: మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఆదిలోనే ఆటంకం ఏర్పడుతోందనే వాదన వినిపిస్తోంది. అర్హులైన మహిళలను స్వయం సహాయక సంఘాల్లో సభ్యురాలిగా చేర్చి.. వారు ఆర్థికంగా ఎదిగేలా బాటలు వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో ఈ ఏడాది 1,148 స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాల్సిన సీఓ(కమ్యూనిటీ ఆర్గనైజర్లు)ల కొరత వేధిస్తోంది. ఉన్న వారిపై భారం పడి కొత్త సంఘాల ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతుండడం గమనార్హం. ఖమ్మం నగర పరిధిలో 4,412 సంఘాలు ఉండగా.. నలుగురు సీఓలే విధులు నిర్వర్తిస్తున్నారు. పాత సంఘాలపై పర్యవేక్షణకు తోడు కొత్త ఏర్పాటు బాధ్యతలు నిర్వర్తించాల్సిన రావడంతో ఇక్కట్లు ఎదురవుతున్నాయి.

నియమావళికి విరుద్ధంగా పనిభారం

నగరంలో 4,412 స్వయం సహాయక సంఘాలకు సంబంధించి రికార్డుల నిర్వహణ, బ్యాంకులతో సమన్వయం, రుణాల మంజూరు పనులను సీఓలు పర్యవేక్షిస్తుంటారు. ప్రతీ 300 – 500 సంఘాలకు ఒక సీఓ ఉండాలనేది నిబంధన. ఈ లెక్కన ఖమ్మంలో 10 మంది సీఓలు అవసరమైతే ఇప్పుడు నలుగురే విధులు నిర్వర్తిస్తున్నారు. ఫలితంగా ఒక్కొక్కరు 1,100 సంఘాలను పర్యవేక్షించాల్సి రావడం ఒత్తిడికి గురిచేస్తోంది. ఇక నలుగురు సీఓల్లో ఇద్దరికి కొత్తగా ఏర్పడిన కల్లూరు, ఏదులాపురం మున్సిపాలిటీల బాధ్యతలు అప్పగించడం గమనార్హం.

ఆలస్యమవుతున్న కార్యకలాపాలు

సీఓల కొరత కారణంగా కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటు తదితర పనుల్లో జాప్యం జరుగుతోంది. ఇప్పటికే ఉన్న సంఘాలకు బ్యాంకు రుణాలు మంజూరు చేయించడం, పత్రాల ధ్రువీకరణ కూడా ఆలస్యమవుతోంది. ఇది అంతిమంగా సంఘ సభ్యుల ఆర్థికంగా అభివృద్ధిపై ప్రభావం చూపుతుందనే చర్చ జరుగుతోంది. ఖమ్మం నగరంలో ఎస్‌హెచ్‌జీల్లో సభ్యులుగా లేని 5వేల మందికి పైగా మహిళలను మెప్మా అధికారులు గుర్తించినా వీరితో కొత్త సంఘాల ఏర్పాటు ఎప్పుడు పూర్తవుతుందో తెలియడం లేదు.

ప్రభుత్వ లక్ష్యాలకు అడ్డంకి

స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు సాధికారత కల్పించడం, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం ప్రభుత్వ లక్ష్యం. కానీ ఖమ్మంలో నెలకొన్న ఈ పరిస్థితి లక్ష్యసాధనకు అడ్డుగా నిలుస్తోంది. కమ్యూనిటీ ఆర్గనైజర్ల సంఖ్య తక్కువగా ఉండడంతో ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం కష్టంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి సరిడా సీఓలను నియమిస్తే తప్ప సంఘాల ఏర్పాటు, ఇతర పనుల్లో వేగం పెరిగే అవకాశం కానరావడం లేదు.

అన్నదమ్ముల మృతదేహాలు లభ్యం

ఘటనపై అనుమానాలతో కుటుంబీకుల ఫిర్యాదు





కంభం నాగేశ్వరరావు, సత్యం (ఫైల్)



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

చింతకాని: మండలంలోని నాగులవంచ రెడ్డి చెరువులో గల్లంతైన అన్నదమ్ములు మత్స్యకారులు కంభం నాగేశ్వరరావు(62), సత్యం(58) మృతదేహాలు సోమవారం ఉదయం లభ్యమయ్యాయి. గత 35ఏళ్లుగా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులుగా కొనసాగుతున్న వారికి ఈత కొట్టడంలో నైపుణ్యం ఉన్నా చెరువులో మునిగి మృతి చెందడంపై అనుమానాలు ఉన్నాయని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు... మత్స్యకారుడైన కంభం నాగేశ్వరరావు గ్రామంలోని రెడ్డిచెరువును ఏటా రూ.4లక్షల చొప్పున సభ్యులకు చెల్లించేలా రెండేళ్ల కాలానికి లీజ్ తీసుకుని చేపల పెంచుతున్నాడు. రోజులాగే ఆయన ఆదివారం మధ్యాహ్నం తన తమ్ముడు సత్యంతో కలిసి ద్విచక్ర వాహనంపై చెరువు వద్దకు వెళ్లారు. కట్టపై ద్విచక్ర వాహనం పెట్టి అక్కడే బట్టలు, చెప్పులు విడిచి చెరువులోకి దిగిన అన్నదమ్ములు గల్లంతయ్యారు. రాత్రి వరకు వారు రాకపోవడం, సెల్‌ఫోన్లు స్విచాఫ్ ఉండడంతో కుటుంబీకులు పరిశీలించగా కట్టపై బైక్, దుస్తులు, చెప్పులు ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్సై నాగుల్‌మీరా ఆధ్వర్యాన గాలించినా ఆచూకీ తెలియరాక చీకటి పడడంతో గాలింపు నిలిపివేశారు. తిరిగి సోమవారం ఉదయం గాలిస్తుండగా పాతర్లపాడు చెరువు నుంచి నీళ్ల రెడ్డి చెరువులో కలిసే ప్రాంతంలో నాగేశ్వరరావు, సత్యం మృతదేహాలు లభ్యమయ్యాయి. కాగా, గాలింపు చర్యలను వైరా సీఐ సాగర్ పర్యవేక్షించారు. కాగా, ఒకే ఘటనలో అన్నదమ్ములిద్దరి మృతితో కుటుంబంతో పాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆర్థికపరమైన విబేధాలు

నాగేశ్వరరావు, సత్యం మృతిపై కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. రెడ్డి చెరువును నాగేశ్వరరావు సంఘ సభ్యులందరి సమ్మతితో లీజ్‌కు తీసుకోగా, సంఘంలో సభ్యుల మధ్య విభేదాల కారణంగా ముగ్గురు వ్యతిరేకించారు. దీంతో ఆ ముగ్గురు చెరువులో నాగేశ్వరరావు అమర్చిన వలలు తొలగించేందుకు ఆదివారం ఉదయం మరో ముగ్గురితో కలిసి వెళ్లినట్లు సమాచారం. ఈమేరకు నాగేశ్వరరావు, సత్యం వెళ్లడం ఆ తర్వాత గల్లంతవడంతో ఆరుగురిపైనే అనుమానం ఉందని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, అన్నదమ్ముల మృతిపై నాగేశ్వరరావు కుమారుడు వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

అంత్యక్రియలకు వచ్చి ప్రమాదవశాత్తు మృతి

ఖమ్మంక్రైం: బంధువుల అంత్యక్రియలకు హాజరైన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతి చెందిన ఘటన ఇది. ఖమ్మం నిజాంపేటకు చెందిన దాసరి రామకృష్ణ(44) వేణుగోపాల్ నగర్ ప్రాంతంలో సోమవారం తమ బంధువుల అంత్యక్రియలకు హాజరయ్యాడు. అనంతరం అంతా ఎన్నెస్పీ కాల్వలో కాళ్లు కడుక్కుంటుండగా.. రామకృష్ణ కూడా దిగాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు జారి కాల్వలో పడిన ఆయన గల్లంతవడంతో అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఈతగాళ్ల సాయంతో గాలించగా రామకృష్ణ మృతదేహం లభించింది. ఘటనపై ఆయన సోదరుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టూ టౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

ఖమ్మంఅర్బన్: మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఖమ్మం యూపీహెచ్ కాలనీలో సోమవారం వెలుగు చూసింది. కాలనీకి చెందిన జి.వెంకటేశ్వర్లు(52) కొంత కాలంగా మద్యానికి బానిసై కుటుంబానికి దూరంగా జీవిస్తున్నారు. దీంతో ఒత్తిడికి గురైన ఆయన ఇంట్లో ఎవరు లేని సమయాన ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన కుమార్తె ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

కూరగాయల వ్యాపారి...

కూసుమంచి: మండలంలోని ధర్మాతండాకు చెందిన కూరగాయల వ్యాపారి బానోత్ బొజ్జ(45) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎకరం పొలంలో కూరగాయలు సాగు చేయడమే కాక మార్కెట్ల నుండి తెచ్చి విక్రయించేవాడు. ఆర్థిక ఇబ్బందులతో ఆదివారం ఆయన గడ్డి మందు తాగగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. ఆయన కుమారుడు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై నాగరాజు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లికి చెందిన కౌలు రైతు వడ్డే భాస్కర్‌రావు(67) సోమవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ముదిగొండ మండలం పమ్మికి చెందిన భాస్కర్‌రావు కొంత కాలంగా పందిళ్లపల్లిలో చిన్న కుమార్తె ఇంటి వద్ద ఉంటూ మూడెకరాల భూమి కౌలు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. సోమవారం పొలం వద్ద కంపచెట్లను శుభ్రం చేసే క్రమాన కొడవలి విద్యుత్ తీగకు తాకడంతో షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. ఘటనపై ఆయన భార్య సరోజని ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లుఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

రెండు మండలాల్లో భారీ వర్షం

తిరుమలాయపాలెం రికార్డు స్థాయిలో 8.5 సెం.మీ.గా నమోదు

తిరుమలాయపాలెం/కూసుమంచి: తిరుమలాయపాలెం మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. అర్ధరాత్రి సమయాన రెండున్నర గంటల పాటు వర్షం దంచికొట్టగా రికార్డు స్థాయిలో 8.5 సెం.మీ.గా వర్షపాతం నమోదైంది. ఇప్పటికే భక్తరామదాసు ప్రాజెక్టు నుంచి చెరువులకు నీరు వదలగా ఈ వర్షంతో బీరోలు, జూపెడ, హస్నాబాద్, ఎదుళ్ల చెరువు, బచ్చోడు తదితర గ్రామాల చెరువుల్లోకిభారీగా వరద చేరి అలుగు పోశాయి. పలుచోట్ల వరి పొలాలు, పత్తి చేన్లు కోతకు గురవడమే కాక ఇసుక మేటలు వేశాయి. ఇక కూసుమంచి మండలంలోనూ వర్షంతో నర్సింహుల గూడెం – కొత్తూరు, నర్సింహులగూడెం – కిష్టాపురం మధ్య వాగు వరద రోడ్లపైకి చేరి రాకపోకలు స్తంభించాయి. అంతేకాక తురకగూడెంవద్ద కూసుమంచి వెళ్లే బీటీ రహదారి కోతకు గురవగా, పత్తి చేన్లలో ఇసుక మేటలు వేసింది.



తిరుమలాయపాలెం : భారీ వర్షంతో అలుగు పారుతున్న బంధంపల్లి చెరువు



తిరుమలాయపాలెం : ఎదుళ్లచెరువులో వరదతో కోతకు గురైన వరి పొలం



కూసుమంచి : నర్సింహులగూడెం- కిష్టాపురం మార్గంలో ఉప్పొంగిన వాగు

సంక్షోభంలో లారీల యాజమాన్యాలు



సత్తుపల్లిలో ఆందోళన చేస్తున్నలారీల యజమానులు

- ఆర్‌సీహెచ్‌పీకు బొగ్గు రవాణా అడ్డగింత
- మూడు రోజులుగా కొనసాగుతున్న ఆందోళన

సత్తుపల్లి: సత్తుపల్లికి చెందిన లారీల యాజమాన్యాలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోనే ఇక్కడ ఎక్కువ సంఖ్యలో లారీలు ఉండగా.. వేలాది మందికి ఉపాధి లభిస్తోంది. సత్తుపల్లి కేంద్రంగా బొగ్గు రవాణాపై యాజమానులు, డ్రైవర్లు, క్లీనర్ల కుటుంబాలు జీవనం సాగిస్తుండగా.. ప్రస్తుతం లోడింగ్ లేక వేలాది కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఎదురవుతోంది.

ఫైనాన్స్ సంస్థల ఒత్తిడి..

ఏడాది క్రితం వరకు 650 బాడీ లారీలు, 100 టిప్పర్లతో కలిపి 750 లారీలు ఉండేవి. ఇప్పుడు ఆ సంఖ్య 450కు పడిపోయింది. లారీలకు బొగ్గు లోడింగ్ ఇవ్వకుండా ఆర్‌సీహెచ్‌పీ(రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్)కు రవాణా చేస్తుండడంతో వారి ఉపాధిపై దెబ్బపడుతోంది. ఫైనాన్స్ కిస్తీలు, ట్యాక్స్‌లు కట్టలేక లారీ యజమానులు దిగులుతో మృతి చెందిన ఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. ఇదే సమయాన ఫైనాన్స్ సంస్థల ఒత్తిడి పెరగడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. కొందరైతే ఉన్న ఇళ్లను అమ్మేసి లారీల ఫైనాన్స్ చెల్లించాక ఆ లారీలను అమ్ముకుని జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు.

లోడింగ్‌ను అడ్డుకుని..

బొగ్గునిల్వలు పేరుకుపోవడం, నిప్పు అంటుకుంటుందనే కారణంతో 1.50 లక్షల టన్నుల బొగ్గును రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్(ఆర్‌సీహెచ్‌పీ)కు తరలించేందుకు గతేడాది మే 24న తాత్కాలికంగా అనుమతి ఇచ్చారు. కానీ ఆ రవాణా నేటికీ ఆగడం లేదు. రోజుకు 10వేల టన్నులు రవాణా జరుగుతుండగా.. మూడు నెలల్లో ఆర్‌సీహెచ్‌పీకి పూర్తికావాల్సిన రవాణాను పొడిగిస్తుండడంతో స్థానిక లారీలకు లోడింగ్ దక్కడం లేదు. దీంతో యజమానులు మూడు రోజులుగా రవాణాను అడ్డుకుంటూ ఆందోళన చేపడుతున్నారు. అయినా ఫలితం లేకపోగా, సోమవారం చర్చలు జరిపినట్లు తెలిసినప్పటికీ ఫలితం రాలేదని సమాచారం.

ఇక్కడి నుంచే రాజకీయ మార్పునకు పునాది

బీజేపీ రాష్ట్ర నాయకుడు ఇనుగాల పెద్దిరెడ్డి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఇనుగాల పెద్దిరెడ్డి, నాయకులు

ఖమ్మంమామిళ్లగూడెం: తెలంగాణ రాజకీయ సమీకరణాల్లో ఖమ్మం కేంద్రబిందువుగా మారిందని, ఇక్కడే రాజకీయ మార్పునకు పునాది పడనుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు, స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా ఇన్‌చార్జి ఇనుగాల పెద్దిరెడ్డి పేర్కొన్నారు. ఖమ్మంలో సోమవారం 'మహా సంపర్క్ అభియాన్' పేరిట పార్టీ శ్రేణులతో సమావేశమైన ఆయన ఆతర్వాత విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖమ్మం జిల్లా ఇప్పుడు ప్రధాని మోదీ నాయకత్వంలోని బీజేపీకి శక్తిని అందించనుందని తెలిపారు. జిల్లాలో రాజకీయ వాతావరణం మారుతూ, ప్రజలంతా మార్పు వైపు మొగ్గు చూపుతున్నందున స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేలా బూత్ స్థాయిలో ప్రచారం నిర్వహిస్తామని వెల్లడించారు. బీఆర్‌ఎస్‌లో కుటుంబ కలహాలతో అలజడి నెలకొనగా, కాంగ్రెస్ ప్రభుత్వంలో శూన్యతను ప్రజలు గుర్తించారని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు దేవకీ వాసుదేవరావు, ఈ.వీ.రమేష్, నున్న రవికుమార్, పుల్లారావు యాదవ్, దొంగల సత్యనారాయణ, నంబూరి రామలింగేశ్వరరావు, అల్లిక అంజయ్య, జ్వాలా నర్సింహారావు, గడిల నరేష్, ధనియాకుల వెంకటనారాయణ యాదవ్ పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా గుళికల విక్రయాలు

నేలకొండపల్లి: రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని పంటల్లో తెగుళ్ల నివారణకు ఉపయోగపడతాయని అనుమతి లేని గుళికలు అమ్మేందుకు దళారులు రంగంలోకి దిగారు. మండలంలోని మంగాపురం తండాకు సోమవారం రాత్రి వాహనాల్లో వచ్చిన ఏపీ వాసులు కొందరు గుళికలను విక్రయించే ప్రయత్నం చేశారు. నాలుగు కిలోల గుళికల ప్యాకెట్‌ను రూ.600 వరకు కొందరికి విక్రయించచగా, అనుమానం రావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు వచ్చేసరికి వారు కారులో పరారయ్యారు. అయితే, వారి కార్ నంబర్‌ను ఫొటో తీయడంతో పోలీసులు విచారణ మొదలుపెట్టారు. ఈ విషయమై ఏఓ ఎం.రాధను వివరణ కోరగా విషయం తెలియగానే గ్రామంలో విచారించి పోలీసులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. అయితే, వారు కేవలం ఆర్డర్ తీసుకున్నట్లు తెలిసిందని వెల్లడించారు.

● నా బిడ్డలకు భవిష్యత్ ఇవ్వండి..



ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా దుగ్గిరాలపాడుకు చెందిన గోపమ్మ తన ఇద్దరు పిల్లలతో కలిసి సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌లో ప్రజావాణికి వచ్చింది. ఆమెకు చింతకాని మండలం ప్రొద్దుటూరు వాసితో వివాహం జరగగా.. ఆరేళ్ల నుంచి గోపమ్మ, పిల్లలను భర్త పట్టించుకోవడం లేదు. పిల్లల పేరిట రెండెకరాల భూమి రాస్తామని చెప్పిన భర్త, కుటుంబీకులు ఇప్పుడు అమ్మకానికి యత్నిస్తుండడంతో ఆమె కోర్టును ఆశ్రయించింది. భూమి అమ్మకుండా అడ్డుకోవాలని కోరడమే కాక పిల్లలకు వారసత్వ పట్టా అయ్యేలా చూడాలని కలెక్టరేట్‌లో అధికారులకు విన్నవించింది. ప్రజావాణి ప్రారంభం కాకుముందే వచ్చిన ఆమె పిల్లలను టిఫిన్ చేయిస్తుండగా వివరాలు ఆరా తీయడంతో తన గోడు వెళ్లబోసుకుంది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

రిటైర్డ్ ఎస్ఐ ఇంట్లో చోరీ.. మళ్లీ దొరికిన ఆభరణాలు

వైరా: పుణ్యక్షేత్రాల సందర్శనకు వెళ్లిన ఓ రిటైర్డ్ ఎస్ఐ ఇంట్లో చోరీ జరగగా.. పోలీసుల విచారణ అనంతరం ఇంటిఆవరణలోనే ఆభరణాలులభించిన ఘటన ఇది. వైరాకు చెందిన రిటైర్డ్ ఎస్ఐ, మార్కెట్ మాజీ చైర్మన్ బీడీకే.రత్నం ఈనెల 1న తమిళనాడు రాష్ట్రం వేలాంగిని మాత ఆలయానికి కుటుంబంతో వెళ్లారు. ఈ సమయాన ఇంట్లోని బంగారు ఆభరణాలను బీరువాలోనే భద్రపరిచారు. సోమవారం వచ్చేసరికి బీరువాలోని 20 తులాల బంగారు ఆభరణాలు లేకపోవడంతో చోరీకి గురైనట్లు భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, ఇంటి తాళం వేసినట్లే ఉన్నా బంగారం మాయం కావడంపై పోలీసులు విచారణ చేపట్టారు. ఆతర్వాత కుటుంబీకులు వెతుకుతుండగా ఇంటిఆవరణలోనే ఆభరణాలు కలిగిన బ్యాగ్ లభించడంతో గమనార్హం.

డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 51మందిపై కేసు

ఖమ్మంక్రైం: ఖమ్మంలో సోమవారం డ్రంకెన్ అండ్ డ్రైవ్ విస్తృతంగా చేపట్టినట్లు ట్రాఫిక్ సీఐ బెల్లం సత్యనారాయణ తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌గా చేపట్టిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 51మందిపై కేసు నమోదు చేశామని వెల్లడించారు. కాగా, వాహనం నడిపే వారు హెల్మెట్ ధరించకున్నా, మద్యం సేవించినా కేసు నమోదు చేస్తామని, నంబర్ ప్లేట్ లేని, సైలెన్సర్ మార్చిన వాహనదారులపై చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి



రాయల కల్యాణ్ (ఫైల్)

కొణిజర్ల: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో కారు నడుపుతున్న యువకుడు మృతి చెందిన ఘటన కొణిజర్ల మండలం పల్లిపాడు సమీపాన ఆదివారం అర్ధరాత్రి దాటాక జరిగింది. వైరాకు చెందిన రాయల కల్యాణ్(19) కొణిజర్ల మండలం చిన్నమునగాలలో అమ్మమ్మ, తాతయ్య వద్ద ఉంటూ పల్లిపాడు సమీపాన కారు గ్యారేజ్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి ఆయన గ్యారేజ్ నుంచి కారులో పల్లిపాడు వైపు వెళ్తుండగా రైస్ మిల్లు సమీపాన భద్రాచలం నుంచి హైదరాబాద్ వెళ్తున్న ట్రావెల్స్ బస్సు ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జవడంతో తీవ్రంగా గాయపడిన కల్యాణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కల్యాణ్ తాత తిగుళ్ల కోటేశ్వరరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.సూరజ్ తెలిపారు. కాగా, ఎదురెదురుగా ఢీకొన్న కారు, బస్సు రోడ్డు మధ్యలో నిలిచిపోవడంతో ఖమ్మం – వైరా రహదారిపై ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో పోలీసులు బస్సును జేసీబీ సాయంతో వాహనాలను పక్కకు తొలగించి రాకపోకలను క్రమబద్ధీకరించారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ

● భద్రాద్రి జిల్లా వాసి మృతి

కొణిజర్ల: ద్విచక్రవాహనాన్ని వెనక నుంచి లారీ ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కొణిజర్ల ఎస్ఐ జి.సూరజ్ వెల్లడించిన వివరాలు... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం మామిడి గుండాలకు చెందిన ముక్తి భూపతి(38) ఓ ప్రైవేట్ బీమా కంపెనీలో పనిచేస్తున్నాడు. వైరాలో మార్కెటింగ్ ఏజెంట్ల శిక్షణ సోమవారం జరగగా ఆయన హాజరై తిరిగి ఇంటికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యలో కొణిజర్ల ఎంపీడీఓ కార్యాలయం సమీపాన ఆయన బైక్‌ను వెనక నుంచి కంటైనర్ లారీ ఢీకొట్టడమే కాక టైరు భూపతి పైనుంచి వెళ్లడంతో తీవ్ర గాయాల పాలై ఘటనాస్థలిలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య తులసి, ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. భూపతి సోదరుడు విజయ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.